# కలహంలో కాంతారావు

దామర్ల శ్రీరామకృష్ణ

ఉసూరుమంటూ పది కొట్టింది గోడ గడియారం.

తాజాగా డ్రెస్ చేసుకొని మెత్తని సోఫాలో కూర్చొని పేపరు తిరగవేస్తున్నాడు కాంతారావు. సహజ సౌందర్యవంతుడైన అతనికి పై మెరుగులు ఎంతో ఆకర్షణీయంగా వున్నాయి. ఫంకా గాలికి నొక్కులజుత్తు వయ్యారంగా కదులుతుంటే సన్నని మెరుపుతీగలవంటి వ్రేళ్ళతో సరిచేసుకుంటూ పేజీలు తిరగవేస్తూ తనలో తానే నవ్వుకుంటున్నాడు... ఆ నాడు ఎందుకో కాంతారావు చాలా ఆనందంగా వున్నాడు. పున్నమినాటి చంద్రునివలె అతనిముఖం ప్రకాశిస్తోంది. తెరలు తెరలుగా సంతోషం వస్తున్నట్లు ముఖకవళికలు తెల్పుతున్నాయి.

అడుగులో అడుగు వేసుకుంటూ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ లక్ష్మి కాఫీ కప్పుతో హాల్లో ప్రవేశించింది: కాంతారావు తల ఎత్తిచూసి తిరిగి దించుకున్నాడు. ఆమె ముఖం ముడుచుకుంటూ పెదవులు కొరుక్కుంటూ, కాఫీ కప్పు మేజాపై పెట్టి అలానే నిల్చుంది. ఆమె కళ్ళు వెయ్యి కాండిల్ బల్బులా వెలుగుతూ కాంతారావు ముఖంలోకి చూస్తున్నా అతను మాత్రం తలఎత్తయినా చూడటం లేదు...

"కాఫీ....చల్లారుతుంది...త్రాగి చదువుకోండి" లక్ష్మి చేసేదిలేక అతనికి గుర్తు చేసింది....

"ఓ! అడగకముందే తెచ్చావన్నమాట! ఈవాళ ఏదో పర్వదినం..." కాంతారావు లేతపెదవులతో నవ్వుతూ వ్యంగ్యంగా అన్నాడు.

కాంతారావు స్వభావం ఎప్పుడూ ఇంతే తన చదువుకు, ఉద్యోగానికి తగిన హోదాతోను, బెట్టుతోను మెలిగే అలవాటు అతనికుంది...దాన్ని ఇంటిబయటే కాకుండా ఇంటిలోపల కూడా ఆచరిస్తుంటాడు... అతనువాడే భాషలో వ్యంగ్యం దాక్కొని ఉంటుంది.

లక్ష్మి అపరిచితురాలు కాదు. కాని కాంతారావు ఉద్దేశ్యంలో పరిచితురాలికి ఇవ్వవలసిన అంతస్తు ఇవ్వకూడదని...భార్యభర్తలే అయినా, వారిరువురిలోనూ మంకుతనం కరుడుకట్టి వుండటంలో, దైనిక జీవితములో ఇరువురికి చిన్నారి చిట్టితగాదాలు తప్పవు. చిన్న విషయం పెద్దపేచీగా మారుతుంది...చివర కెప్పుడో చల్లారుతుంది.

కాంతారావు ఎంత పెంకిఘటమో అంతకంటే రెండాకులు ఎక్కువే లక్ష్మి...తను లెక్చరర్ కాస్తో కూస్తో ధనవంతుడు; అవసరానికి మించిన అందం వుంది. ఇవి కాంతారావుకు గర్వం కలిగిస్తుంటాయి...అవే అతని పెంకితనానికి పునాదులు.

తను అందగత్తె! శ్రీమంతుల ఆడపడుచు! ఇవి లక్ష్మి గర్వానికి కారణాలు. ఇవే ఆమె పెంకితనానికి ఆభరణాలు.

కాంతారావు చదువుతున్న పత్రిక అవతల పారవేసి, కాఫీ కప్పును పెదవులకు అంటించాడు. గుటక తర్వాత గుటక వేస్తూ, ఏటవాలుగా కళ్లుతిప్పుతూ, తనలో తానే చిరునవ్వు చిందించుకున్నాడు...

"ఈవాళ కాఫీ చాలాబాగుంది లక్ష్మి! ఏమన్నా అమృతం కలపలేదుగదా!" లక్ష్మి కళ్ళల్లోకి సూటిగా చూశాడు.

"మీరే అన్నారుగా, పర్వదినం అని... అందుకనే బాగుండి వుంటుంది. మీకు నచ్చితే సరి..." ఆమె తూకమేసినట్లు జవాబు చెప్పింది.

కాంతారావు కప్పులో సగం కాఫీవుంచి "పాపం! నీకులేదు కామాలు! ఇది త్రాగుదూ" అన్నాడు...

"రెండు కప్పుల కాఫీ గదిలోవున్నది. నాకేం ఇవ్వక్కర్లేదు" లక్ష్మి అంది.

కాంతారావు మూతి ముడుచుకున్నాడు. గట్టిదెబ్బ తగిలినట్లుంది, అతనికి వాచీ చూసుకున్నాడు — పదిహేను నిమిషాలు గడిచిపోయాయి. కాలేజికి ఇంకాముప్పావు గంట టైముంది...తిరిగి పత్రిక తీసి చదవటం మొదలెట్టాడు.

ఆనాడు, ఫస్టుతారీఖు అవటంతో అతనికి సంతోషంగా వుంది—జీతం మూడువందలు ముట్టచెబుతారు...అందుచేతనే చాలా తొందరపడుతున్నాడు, కాలేజికి వెళ్లాలని.

ఖాళీకప్పు లోపలపెట్టి తిరిగివచ్చింది, లక్ష్మి.

"ఈవాళ పర్వదినమన్నారు!...ఎందుకో తెలుసుకోండి!..." ఆమె ఆసక్తితో చూసింది...చూపులు, జవాబు చెప్పకోమన్నట్లు కాంతారావును ప్రశ్నించినట్లున్నాయి...

"నీవు చెప్పు చూదాము..." అతను తేలిగ్గా నవ్వుతూ అన్నాడు...

"చెప్పమంటారా? ఈవాళ ఫస్టుతారీఖు! అందుకనే పర్వదినం..." లక్ష్మి నవ్వింది...

కాంతారావు కళ్ళు పెద్దవిచేస్తూ "ఫస్టుతారీఖు అయితే పర్వదిన మెందుకు?..."

"బలేవారు మీరు! మీకు జీతం వస్తుంది గదూ..."

"అయితే!..."

"అయితే, గియితే, ఏంలేదు! డబ్బు వస్తుందిగదా అంట..."

"వస్తుంది"

"అందుకే, నాకు సంతోషం...అంతే ఎందుకో ఆలోచించండి...' లక్ష్మి సోఫాలో రావు ప్రక్కన కూర్చుంది...కాంతారావు జరిగి సర్దుకున్నాడు...

"అర్థం అవలేదుగదూ! చెపుతాను వుండండి; బెనారస్ సిల్కు చీర ఈ నెల్లో తెస్తామన్నారుగదూ! గుర్తు తెచ్చుకోండి..." లక్ష్మి రావు కళ్ళల్లోకి చూస్తూ, పదహారు పళ్లు విప్పి నవ్వింది...

కాంతారావు మౌనంగా వున్నాడు— అతని దృష్టి రెపరెపలాడే, నాకిలి కర్టెను మీదకు వాలింది...అక్కడనుండి వయ్యారంగా అల్లుకొన్న సన్నజాజిలతల పైకి పోయింది...లక్ష్మి మాటలు విననట్లు నటించుతున్నాడు...

"గుర్తుకొచ్చిందా! అవునులెండి, నా మాటంటే చెవులకు సోకదు..." ఆమె బుంగ మూతిపెట్టి, సొగసుగా చూసింది...

"ఈ నెల్లో బెనారస్ చీర తెస్తానన్న మాట! అంతేకదూ..." రావు ప్రశ్నార్థకంగా చూస్తాడు...

"అనలేదూ......సరిగ్గా గుర్తు తెచ్చుకోండి..."

"అయితే కావచ్చు; దానికి ముంచుకు పోయిందేముంది?" రావు సాఫీగా అన్నాడు...

"అందుకే; ఈవాళ ఫస్టుతారీఖుగనుక, అంటే డబ్బు వస్తుందికనుక,—ఆ మాట వల్లించుకోమంటున్నాను...అంతకంటే ఏమిలేదులెండి! మరి కంగారు పడుతున్నారు" అంది లక్ష్మి...

"అయితే పర్వాలేదులే బ్రతికించావు! ముందు డబ్బు రానియ్యి..."

"కాలేజికి వెళ్ళగానే వస్తుందిగా! నేను రెడీగా వుంటాను! సాయంత్రం షాపింగ్ వెళ్లిదాము..."

"ఆ పనిమాత్రం చేయకు; నేను చెప్తానుగా నీకు......" రావు మృదువుగా పలికాడు.

"అసలు వద్దంటారా..." అదోలా ముఖం పెట్టుకొని అడిగింది.

"అదే తర్వాత చెపుతానులే; ముందు డబ్బు రానీయి;...వీలుగావుంటే, తీసుకుందాం; మొదట ఇతరఖర్చులు వున్నాయి; ఆ తర్వాత మిగిలితే...నీ చీర విషయం చూస్తాను..." కాంతారావు చావు కబురు చల్లగా చెప్పాడు.

లక్ష్మికి కోపం, విచారం, ముంచుకొచ్చాయి! తనకెంతో అన్యాయం జరిగినట్లు, తన ప్రతిపత్తికి హాని కలిగినట్లు బాధపడింది...కళ్ళు చెమ్మగిల్లాయి. ముఖం కందగడ్డలా అయింది...

"ఇక, దానికి సున్న అన్నమాట..." బొంగురుగొంతుతో అంది; మాటలు ఎంతో కష్టంమీదగాని పెగలటం లేదు...

"లక్ష్మీ! అన్నీ నీవే అనుకుంటున్నావు! అపార్థాలు కల్పించుకుంటున్నావు...... వీలుంటే తెస్తానన్నాను-దీనికోసం ముఖం అదోలా పెట్టుకుంటే లాభం ఏమీలేదు" కాంతారావు, లేచాడు సోఫానుంచి...

తన గదిలోకి వెళ్ళి, ఫైల్, కొన్ని పుస్తకాలు తీసుకొని, కాలేజికి బయలుదేరాడు...

సత్యభామ కోపాన్ని అభినయిస్తూ, లక్ష్మి అతని పోకడను ఓరకంటితో చూసింది. కోపం ముంచుకొచ్చింది అతని వెంకితనానికి; ఏనాడూ, తన మాట వినడు. అంత మొండిగా ప్రవర్తిస్తాడతను...

దబాలున తలుపు వేసుకుంది లక్ష్మి.



నల్లని తారురోడ్డుమీద చకచక అడుగులు వేసుకుంటూ, కాంతారావు పోతున్నాడు; ఎంతదూరం నడచినా, అతనికి కాలేజి కనుపించేట్లు లేదు—బాటాబూట్లు చప్పుడు విని సంగీతంలా ఆనందిస్తూ నడుస్తున్నాడు.

నిజంగా తన ప్రవర్తన తనకే సంతోషంగా వుంది. తన లెక్చరర్ అధికారం, క్లాసు విద్యార్థులమీద నేకాదు. ఇల్లాలిపై కూడా, నిరాటంకంగా చెలామణి అవుతుంది.

ఆనాడు ఫస్టుతారీఖని తనకు ఎంతో సంతోషంగా వుంది. మూడు పచ్చనోట్లు కళ్లల్లో తారట్లాడాయి. ఇంటి ఖర్చుక్రింద ఒక్కనోటు మినహాయించుకున్నాడు. మిగతాది తన జల్సాలకు ఉపయోగించుకోవాలి.


# ★ కలహంలో కాంతారావు ★

అసలే తను క్రొత్తగా చేరాడు లెక్చరర్ గా. డ్రస్సులోను, ఇతరవిషయాలలోను,వున్నత స్థాయిలో వుంటేనే, తనకు గౌరవము, తనకు విలువ. తనబట్టలు చూసుకున్నాడు. అవ్వే అట్టే బాగులేవు. ఎంత మంచివయినా చిన్న వేగా! ఏంవిలువ వుంటాయి. మంచి ట్వీడ్ సూటు కుట్టించుకోవాలి. అప్పుడు గౌరవముంటుంది...

ఇక లక్ష్మివిషయం ఆడవాళ్ళకేందుకు, అంత ఖరీదుగల బట్టలు: ఇప్పుడున్నవి చాలవూ! పైగా, ఇంటినుండి బయటికి వస్తుందా, పోతుందా! ఎప్పుడూ, ఆ నాలుగుగోడల మధ్యనేగా. పైగా తనవద్ద ప్రస్తుతం డబ్బులేదాయే! అవచ్చే డబ్బుతో తను ట్వీడ్ సూటు కుట్టించుకోవాలి. ఇక కాళ్ళజోడు ఏమీబాగులేదు. తోటి లెక్చరర్ లు అంబాసిడర్, బూట్లు తొడుగుతున్నారు. తనకీ ఒకజత వుంటేనే గౌరవము.

ఇలా ఆలోచిస్తూ కాంతారావు, కాలేజి గేటువద్దకు వచ్చాడు...నిట్టూర్పుతో ఆఫీసులోకెళ్ళి. అటెండెన్సులో సంతకముపెట్టి ఇక క్లాసులకు హాజరవటానికి బయలుదేరాడు. అతనికి క్లాసులవగానే ఎంతో భయమేసింది. ఆనాడు, వరుసగా, మూడు గంటలు వాగాలి! తలకొప్పిరాదూ!...కాని అతనికి మూడువందలు గుర్తుకొచ్చేసరికి, గబగబా అడుగులేసుకుంటూ, క్లాసులోకి వెళ్ళాడు.

మూడుగంటలని పేరేగాని ఎంతసేపు, మూడునిమిషాల్లా గడచిపోయాయి. ఖచ్చితంగా రెండయింది క్లాసునుండి బయటికి వచ్చేసరికి ఆఫీసులోకిపోయి, కౌంటర్ వద్ద సంతకముచేసి, మూడు పచ్చకాగితాలు చేతుల్లోకి తీసుకున్నాడు.



బ్రాంచీలు: హైదరాబాదు & విజయవాడ.

ఇప్పుడు కాంతారావుముఖం వికసించిన తామరపువ్వులా వుంది. మూడువందలు జేబులో పెట్టుకుని టీచర్సు రూములోకి వెళ్ళాడు. ఏదో పత్రిక తిరగవేస్తూ, చదువులో మునిగివున్న తోటిలెక్చరర వెంకట్రావ్, ధరించిన లేతమామిడిచిగురు పులెన్ ట్వీడ్ సూటు, అతని కళ్ళను ఆకర్షించింది. చప్పున వెంకట్రావ్ దగరకెళ్ళి, భుజాన చరచి, చిరునవ్వుతో కూర్చున్నాడు కాంతారావు.

“క్లాసులన్నీ ఫినిష్ చేశావోయ్...” సిగరెట్టు వెలిగిస్తూ వెంకట్రావ్ మందహాసం చేశాడు...

“ఈవాళ నాతల పగిలిపోయిందనుకో... వరసగా మూడుగంటలు వాగేయాలిసొచ్చిందోయ్...” తగురీతిగా జవాబు చెప్పాడు కాంతారావు...

“సాలరీ తెచ్చుకున్నావుగా...” తనకు ఆఫర్ చేసిన సిగరెట్టును తీసుకుంటూ. తిరిగి కాంతారావు ప్రశ్నించేసరికి, అవునన్నట్లు తలవూపేడు వెంకట్రావ్...

కాంతారావు రెండుకళ్ళూ, అతనిట్వీడ్ సూటుమీదనే వున్నాయి.

“ఎప్పుడు తీసుకున్నావోయ్ ఆసూటు.”

“లాస్ట్ వీక్! ఏమంత బాగుండలేదు గదూ...”

“నో! బెస్టుగా వుంది! ఎక్కడ తీసుకున్నావేంటి...”

“సిల్కు ప్యాలెస్ లో;! నీవు కూడా తీసుకోకూడదు; నీ ఎరుపు శరీరానికి ఈ రంగు నైస్ గా వుంటుంది...”

“అయితే వెళదాము పద! నీవుకూడా సెలక్టు చేద్దువుగాని” అని కాంతారావు, వెంకట్రావును వెంట పెట్టుకొని సిల్కు ప్యాలెస్ కు వెళ్ళాడు... రెండు జతలకు సరిపోయే క్లాత్ తీసుకున్నాడు...సూటు ఏభై రూపాయలు ఐనా, అతనికి అట్టే కష్టం కలుగలేదు. తను ఏనాటినుండో, కలగంటున్న కోరిక, ఈడేరిందని, సంతోషం... పైగా, తన అంతస్తును అది, బాగా గుర్తింప చేస్తాయి......

ఇంకో ముప్ఫయి రూపాయలు పెట్టి బూట్లు కొన్నదాకా, అతనికి తృప్తి కలుగలేదు. పులెన్ సూటుకు ఆ బూట్లు తగివుంటాయి, రెంటికీ జత బాగుంటుంది... అని అనుకొన్నాడు...వెంకట్రావ్ కు గుడ్ బై, చెప్పి, ఉత్సాహంతో గృహం చేరుకున్నాడు...

కాంతారావు తెచ్చిన వస్తువులు చూడటానికి, లక్ష్మికి కోపం వచ్చిందో! లేక సంతోషం వచ్చిందో, ఆమెకే తెలియాలి ...కాగితంలో వున్న బట్టలనుచూసి, తన చీర వుందనుకుంది; ... ఏలాగయినా తన మాట, నెగ్గిందని, సంతోష పడింది...

కాంతారావు వాటిని చూపించేవరకు, తనకు జరిగిన అన్యాయాన్ని ఆమె తెలుసుకోలేదు. తన వూహాలు గాలిలో కలిశాయని అనుకుంది.

ట్వీడ్ క్లాత్ చూపిస్తూ, “చూశావు లక్ష్మి! ఎంత బాగుందో! చాల ఖరీదు లే, నావంటికి బాగుంటుందేమో...చెప్పు...”; కాంతారావు పలికిన పలుకుల్లో వ్యంగ్యం వుందో, పెంకితనం వుందో, సంతోషం వుందో, లక్ష్మికి అర్థంకాలేదు.

లక్ష్మికి ఏడ్పొంతపనయింది. నిజంగా ఏడ్చేదే; కాని అభిమానం అడ్డుపడింది. దానికి బదులు కోపం అవధులుదాటి, ఎవరెస్టు శిఖరం అందుకుంది. తనకు చీర తేలేదు సరిగదా! తను ట్వీడ్ సూట్లు తెచ్చుకున్నాడు-; పైగా తనకు చూపిస్తూ వెక్కిరిస్తున్నాడు. ఇవి ఆమె ఆలోచనలు తనకు భరించరాని అవమానం జరిగిందని, తన హృదయంలో మానరాని, గాయం తగిలిందని; ఆమె భావన.

కాంతారావు పెంకితనం అంతటితో ఆగలేదు. నిగనిగలాడే బూట్లను, చూపిస్తూ “లక్ష్మి! ఇది రీసెంటు ఫ్యాషను! ముప్ఫయి రూపాయలు. చాలా బాగున్నాయి కదూ ...” అన్నాడు...;

అసలే గాయపడిన ఆమె హృదయానికి, ఆ మాటలు గట్టిగా గుచ్చుకున్నాయి. కళ్ళల్లో నీళ్ళు కాస్త మెరిశాయి గాని, వెంటనే వెనక్కు త్రిప్పుకుంది ... వాడిన గులాబిలాముఖం పెట్టింది;

కాంతారావు మళ్ళీ మళ్ళీ చూసుకుంటూ పెట్టెలో పెట్టి, సోఫాలో కూర్చొని “కాఫీ తీసుకురా!” అన్నాడు, చేతులు దులుపుకుంటూ.

లక్ష్మి కదలకుండానే, అలానే నిల్చుంది, “లక్ష్మి! కాఫీ అవలేదూ! మర్చిపోయాను, ఈ వాళ సినిమా కెళదాము, తయారవు” ఆశగా ముఖంపెటి చూశాడు.

“కాఫీ గీఫీ ఏమిలేదు! సినిమా, గినిమా! ఏమివద్దు” ... అన్న, లక్ష్మి పలుకులు, అతనికి అట్టే ఆశ్చర్యం కలిగించలేదు. పర్యవసానం అలాగే వుంటుందని అతను అర్థం చేసుకున్నాడు. అయినా, కొంత వరకు సమాధాన పడదామని అతని తలంపు. అందుచేతనే, లక్ష్మిని లాలించి అడిగాడు. చీర తేకపోవటం, ఆమె కోపానికి మూలం అని ఎరుగున్నా, దాన్ని సినిమారూపంలో మరిపింప చెయ్యాలనుకున్నాడు.

“లక్ష్మి: ఎందుకలా ముడుచుకుపోతావు చీరెదేముంది! వచ్చేనెల్లో తీసుకుందాం!..

నేనూ.. ట్వీడ్‌సూటు తీసుకొనే వాడినే కాదు... కాని నా లెక్చరర్ పనికి మంచి సూటు అవసరం కదూ; తప్పనిసరి అయి తీసుకున్నాను; బూట్లుకూడా అంతే... దీనికోసం... పెద్దగా..." కాంతారావు శాంతియుత పరిష్కారానికి తన ఆసక్తి కనుపరిచాడు... కాని ఎదుటివారికి ఆ ఆసక్తి వుంటేనే పరిష్కారం సాధ్యం...

లక్ష్మిపై, ఆ లాలింపుపలుకులు పనిచేయ లేదు సరిగా, ఆమె తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకోవటానికి, తన సర్వాధికారాన్ని వినియోగం చేయాలని ఆలోచిస్తోంది...

"అయితే కాఫీ ఇవ్వకన్నమాట.. పోనీలే, హాయిగా హోటలుకెళ్ళి తాగుతాను.." అంటూ కాంతారావు వీధిలో అడుగు వేశాడు...

అతని మనస్సు కొంచెం దెబ్బతిన్నట్లయింది. ముఖంలో కళాకాంతులు లేవు. లక్ష్మి అంటే అతనికి కోపంతో పాటు ఈర్ష్య, వాటితో పాటు అసహ్యం...పుట్టుకొచ్చాయి తను ఎంతో సంతోషంగా సూటు తీసుకుంటే ఆమెకు దుఃఖమొస్తుంది పోనీ! తను ఒకజత తగ్గించుకొని. చీర తెచ్చివుంటే బావుండేదేమో అనుకున్నాడు.

కాని సమస్య సుఖాంతం కావటం కాంతారావుకు ఇష్టంలేదు. తను సంపాదనపరుడు తన డబ్బుఖర్చు తన ఇష్టంమీద జరుగుతుంది, తనహోదాకు తగ్గట్టు అన్ని అవసరాలు సమకూర్చుకుంటాడు గని మీద ఆడపెత్తనం ఏమిటి? తను లక్ష్మికి లొంగకూడదని, అలా చేస్తే తన అంతస్తు అంతరిస్తుందని తలచాడు.

లక్ష్మికి ఆలోచనలు ప్రవాహంలా వచ్చాయి. తనకి చీర లేకపోవటంకంటే, తనకు జరిగిన అవమానానికి ఆమె భరించలేకపోయింది...స్త్రీకి తగిన గౌరవమియ్యాలని ఆమె వాదన! భార్యఅంటే, పురుషుని, సేవకురాలేగాదు—అతని సుఖదుఃఖాలలో భాగస్తురాలు! అందుకనే అతను ట్వీడ్ సూటు, తీసుకున్నప్పుడు, తనకూ, చీర తేవాలి!.. ఇవి ఆమె ఆలోచనలు... ఆమెకు తన పుట్టిల్లు గుర్తుకొచ్చింది...లక్షాధికారి గారాబపు కూతురుగా పెరిగిన తను, ఇక్కడ ఏమాట చెల్లుబడిగాని అబలగా అయిపోయింది

రాత్రి ఎనిమిది గంటలకుగాని కాంతారావు ఇంటికిరాలేదు. అంత ఆలస్యంగా వచ్చినా, లక్ష్మి అడగలేదు. కాంతారావుకీ ఆమెను పలుకరించాలని లేదు. పలుకరించనూ లేదు...

భోజనం దగరేవచ్చింది పేచీ. అరగంట చూస్తున్నాడు సోఫాలో; ఆమె పలుకరించ లేదు ప్రేగులు అరుస్తుంటె కాంతారావుకు పట్టరాని కోపంవచ్చింది ఏంచేస్తాడు, ఆమె సహాయ నిరాకరణ చేస్తున్నప్పుడు తనె స్వయంగా వడ్డించుకోగలడు. కాని, తన లెక్చరర్ హోదా అడ్డంవచ్చింది.

చేసేది లేక అతను పెదవులు కదిలించాడు "లక్ష్మి! భోజనమన్నా వడ్డించు..." అతని మాటల్లో దీనత్వం వున్నట్టు కనుపించినా, కోపం, కరుకుతనం దాగి వున్నాయి.

ఆమె ముఖంత్రిప్పకోకనే జవాబిచ్చింది, తనకు భోజనం అవసరములేదని. కాంతారావు మళ్ళీ అందుకున్నాడు. "లక్ష్మి! పరిస్థితిని విషమింపచేస్తున్నావు నేనెంతో మంచివాణ్ని గనుక సరిపోయింది...మర్యాదగా. అన్నంపెట్టు... లేకపోతే పర్యవసానం ఆలోచించుకో..."

లక్ష్మి తగేరకం కాదు అలా అయితే పరిస్థితి అంత ఉన్నతస్థాయికి వచ్చేదికాదు; బెరుకు లేకుండా అంది. "నాకేం పనిలేదు—నేనువడ్డించను. అవసరముంటేహోటల్ కు పొండి..."


"కారణం?" తెలిసే అడిగాడు. ఆమె నోటినుండి వినాలని.

"మీరు నాకు ఇవ్వవలసిన గౌరవం ఇవ్వటంలేదు; ప్రతివిషయంలోనూ కించపరుస్తున్నారు..."

"చీర తేలేదనేనా ఈరభసంతా...సకేశ ఎన్నాళ్లో కాదోయి. నేనుమాత్రం తెచ్చేది లేదు ... నిక్కచ్చిగా చెపుతున్నాను..." కాంతారావు కోపం వెళ్ళగక్కాడు. కోపంవస్తే ఎంత అతిగా పోవాలో అంత పోతాడు. లక్ష్మిమాటలు అతన్ని రెచ్చగొట్టినాయి తన లెక్చరర్ అధికారం. క్లాసులోనే కాదు, ఇల్లాలిపైకూడా చెల్లాలని అతని పట్టుదల.

"మీ బెదిరింపులకు నేను భయపడను... నాకూ ఆత్మాభిమానం వుంది" లక్ష్మి ఉద్రేకంతో అంది.

"లక్ష్మి! మాటలు కొంచెం జాగ్రత్తగా




"ఏ ఆఫీసు పనివాళ్ళయినా మా ఆఫీసు పనివాళ్ళముందు బలాదూరేనంటె నమ్మండి! వాళ్ళు నన్ను ఎంత తృణంగా అరం చేసుకున్నారనుకున్నారు? ఏళ్ళ తరబడి పనిచేస్తూ కూడా ఒక్క సారైనా నోరెత్తి ఇంక్రిమెంటు అడిగినపాపాన పోలేదు!"

# ★ కలహంలో కాంతారావు ★

రానీ... లేకపోతే..."

"అది మీరే గుర్తించాలి. మళ్లీ అంటున్నాను. నాకు ఆత్మాభిమానంవుంది, పసలేని హెచ్చరికలకు భయపడను..." లక్ష్మికి తను చదువుతున్న రోజుల్లో డిబేటుల్లో మాట్లాడిన వాక్యాలు గుర్తుకొచ్చాయి...

కాంతారావుకు కోపంముంచుకొచ్చింది. తను ఇంతవరకు ఎన్నడూ, అట్టి ప్రతిఘటన చూడలేదు. చివరకు కాలేజీ స్టూడెంట్సు కూడా, తనంటే వణికిపోతారు. అట్టి తను ఒక అబలదగిర చులకన అయ్యాడు.

అతని కుడిచెయ్యి ఆమె ఎడమచెంపపై టక్కీమనితగిలింది...జలజలకన్నీళ్ళురాలాయి. ఆమెకు ఉక్రోషం ఉప్పెనలా ప్రొంగుకొచ్చింది. దెబ్బ తగిలిన బాధకంటె, అవమానంవలన బాధ ఆమెకు భరించరానిదిగా వుంది. చెంపమీద చేయి వాలిందని కాదు. తన ప్రతిపత్తి కించపరచబడిందని ఆమె ఆవేదన, ఆవేశం...

లక్ష్మి పెదవులు వణకుతున్నా... "...నేను ఆడదాన్ని గనుక కొడతారు... కాని అది మీకు గల పశుత్వాన్నిమాత్రం తెలియజేస్తుంది..." ఆమె కంటినీరు వరదలై పారింది.

"లక్ష్మీ! మళ్ళీ చెపుతున్నాను. ఇలా పెంకిగావుంటే నా యింటిలో వుండటం... కుదరదు...అది ఆలోచించుకో..." కాంతారావు ఉన్నతస్థాయిలో మొదలెట్టాడు...

"నేనూ అదే అనుకుంటున్నా... నాకు గౌరవంలేని యింటిలో ఒక్క క్షణం వుండను." ఆమె, మాటల్లో తగ్గేరకం కాదు...

ఆరాత్రిఅంధకారంగా గడచిపోయింది...

ఉదయాన్నే తయారయింది లక్ష్మి తన వస్తుసామగ్రి సర్దుకొని, పెట్టె అంతా నింపుకొంది. కాంతారావు ఆమెను గమనించనట్లు నటిస్తున్నా, కొంచెం కలతపొందేడు, పరిస్థితి విషమిస్తోందని.

పెట్టె పట్టుకొని బయలుదేరుతూ... 'వెళతాను' అంది లక్ష్మి. "సంతోషం..." కాంతారావు సాక్షిగా అన్నాడు ... కాని మనస్సు బాధపడింది ... లక్ష్మికి అంతే; కాని స్వభావాలు తగేరకం కాకపోవటంతో ఫలితం, కానవచ్చిందిగాదు...

లక్ష్మి ఎక్కడకు వెడుతోందో, వేరే చెప్పనవసరంలేదు.

ఆ తరవాత కాంతారావు కొంచెం సంతోషపడ్డాడు. తన అధికారాన్ని ధిక్కరించగల సామర్థ్యం ఎవరికి వుండదని, వుండకూడదని. అతని నమ్మకం...అది అక్షరాలా నిజమయింది.

మొదటిరోజు వంటరిజీవితం వయ్యారంగా వుంది. ఇంటికి తాళంపెట్టి, హాయిగా హోటల్లో భోంచేసి, కాలేజికి పోయాడు. రాత్రి సినిమాకు వెళ్ళివచ్చి, మత్తుగా నిద్రించాడు—ప్రతిరోజూ అలానే తేలిగా వుంటుందని అతని నమ్మకం...

లక్ష్మి దగ్గరనుండి ఉత్తరం వస్తుందని, తలచాడు. కాంతారావు. కాని రెండు రోజులు అయినా, అదేం జరగలేదు...... అదోలా బాధపడ్డాడు అతను. లక్ష్మి నిరక్ష్యంగా వుందని దృఢపరచుకున్నాడు...

మూడురోజులకుగాని అతనికి ఇంటిబాధ అర్థం అవలేదు...ఇలు వూడ్చకపోవటంలో దుమ్ము అరడుగు ఎత్తున పేరుకుంది. ఇంట్లోకి రావటానికే అతనికి భయమేసేది...ఇక హోటలు భోజనం ఎంత కష్టంగా వుండో, అతనిముఖం చూస్తేనే తెలుస్తుంది. క్రొత్త బియ్యపు అన్నం కడుపునొప్పి తెచ్చింది. అశుభ్రంగావుండే హోటలు గుర్తుకొచ్చినప్పుడల్లా, కళ్ళు జలదరించేది నీళ్ళు తనే తోడుకోవాలి. అన్నీ తనే. లక్ష్మి అవసరం కొంతవరకు గుర్తుకొచ్చింది. పోనీ మామగారికి ఓఉత్తరం రాస్తే.ఛా! తన అంతస్తును తను కించపరచుకోవడమా! తనే ముందు దిగజారితే ఇహ లక్ష్మికి పట్టపగాలువుంటాయా! తనకు పూచిక పుల్లయినా విలువ వుంటుంది!

లక్ష్మికూడా, అక్కడ మొదటిరోజుల్లో సంతోషపడింది. కాని ఆమెకు తర్వాత అర్థమయింది. తనకు వసతుల్లో లోపం లేదు...కాని ఏమిటో అంతా వెలితిగా కనిపించింది! తనకు తానే నొచ్చుకుంది. తొందరపడినందుకు ఉత్తరం వ్రాస్తారేమో అని చూసింది. పాపం ఎలా వున్నారో! తెలవారుతూనే కాఫీ ఎక్కడనుండి వస్తుంది. తను చేసే రుచికరమైన సాంబారు ఎక్కడ దొరుకుతుంది. కాస్తంత బాధపడింది లక్ష్మి, కాని ఆమెకు స్వతహాగానే వుంది. పెంకితనం. తను లొంగరాదనుకుంది. తనేముందు, బయటపడితే, ఇక గడ్డిపోచకు గల విలువైనా తనకు వుండదనుకుంది.

కాంతారావు కొంచెం అనారోగ్యంగా వుంటున్నాడు హోటలు భోజనము రుచించక పోయేసరికి, భోజనం మానేసి, రొట్టె పాలు, తీసుకొంటున్నాడు.

ఒకరోజు వెంకట్రావ్ కాంతారావు ఇంటికివచ్చాడు...ఆ దుమ్ము చూసేసరికి దిమ్మతిరిగింది కాలు పెట్టటానికి వీలులేనంత దుమ్ము...అసహ్యంగా ఎక్కడ చూసినా వస్తువులే...ఇదరూసోఫాలోకూర్చున్నారు.

వెంకట్రావ్ సిగరెట్టు వెలిగిస్తూ "ఏమోయ్! పెద్దసత్రంలావుంది. మీ ఆవిడ పేరేమిటి" అన్నాడు.

కాంతారావు నోరు పనిచేయలేదు. కాని సర్దిచెప్పాడు. పుట్టింటికెళ్లిందని—

"హోటల్లో భోజనం ఏమంత బాగుండలేదోయ్! చాలాబాధగా వుంది..." కాంతారావు మాటలు కలపటానికి ప్రయత్నిస్తున్నాడు—

"అయితే మా యింటికి రా! ఆమె వచ్చేదాకా అక్కడనే భోంచేద్దువుగాని"

"ఇంకా నయం..."

"ఏమిటోయ్! వస్తే ఏముంది...... హోటలో నీవు కాబట్టి తింటున్నావు... అయితే ఎన్నాళ్ళు అయిందేమిటి వెళ్లి..."

వెంకట్రావ్ వదిలేరకం కాదు...

"ఒక వీక్ అయింది..."

"వెళ్లి, తీసుకురాకూడదూ..." సిగెరెట్ పేక పారవేస్తూ, వెంకట్రావ్ అన్నాడు. కాంతారావు గతుక్కుమన్నాడు. తనకథ అతనికి తెలియలేదు గదా! మాట్లాడకుండా ఏవో ఆలోచిస్తున్నాడు.

"ఏమన్నా, పేచీ రాలేదుగదా!" తన 'సైకాలజీ' నైపుణ్యం ప్రదర్శించాడు వెంకట్రావ్.

అతను మళ్ళీ మౌనంగా వున్నాడు. అసలు విషయం వెంకట్రావ్‌కు చెప్పాలని, మనస్సు

(47-వ పేజీ చూడుడు)



అనేక సంవత్సరముల అనుభవముతో నవీన పద్ధతులలో మాచే తయారుచేయబడిన యినుపపెట్టెలు, ఉక్కు బీరువాలు, క్యాష్ బాక్సులు, మరియు ఆఫీసు రాకులు సరసమైన ధరలకు సకాలములో తయారుచేసి యివ్వగలము.

ఆంధ్రదేశపు ఈ పరిశ్రమను ప్రోత్సహించండి.

ఆంధ్రసేఫ్ కంపెని,

షోరూము: సరస్వతీటాకీస్ రోడ్, విజయవాడ-1.

వర్కుషాపు: మునిసిపల్ ఆఫీసురోడ్, విజయవాడ-1.

# ★ కలహంలో కాంతారావు ★

(16-వ పేజీ తరువాయి)

లో ఉంది, అతను ఏదైనా సొల్యూషన్ సూచిస్తాడని.

కాంతారావు జరిగినదంతా చెప్పాడు. వెంకట్రావ్ నవ్వుతూ-'భలే దాంపత్యమోయి, మీది...'' అన్నాడు.

అంతలో వీధి తలుపులు కొట్టిన శబ్దమైంది.. ఇరువురూ, ఆ వైపు చూశారు.

కాంతారావు చిన్న బావమరిది కిష్టు, ఓ సంచీ చేత్తో పట్టుకొని...ప్రత్యక్షమయ్యాడు.

'నమస్కారమండీ బావగారు ...' అంటూ, కిష్టు కూర్చున్నాడు.

'ఒరేయ్ కిష్టూ! బాగా మాటలు నేర్చావే! కేనా రావటం! సరిసరి! అసంచి అక్కడ పెట్టు. కాఫీకి వెళదాము...'' అన్నాడు కాంతారావు, కిష్టు రాకకు ఆశ్చర్య పడుతూనే.

వెంకట్రావ్ అర్థం చేసుకున్నాడు, ఆ కుర్రాడు అతని బావమరదని.

కాంతారావు కాఫీ త్రాగుతూ, "మిస్టర్ రావు! నే చెప్పటం మర్చిపోయాను...ఈ అబ్బాయి నా చిన బావమరిది, కిష్టు..." అంటూ, కిష్టును పరిచయం చేశాడు...

"ఏమోయ్! ఏమి చదువుతున్నావ్..." వెంకట్రావ్ అడిగాడు.

"ఫిఫ్తు ఫారమండీ .."

"అయితే, మీ బావను తీసుకెళ్ళటానికి వచ్చావన్నమాట. మొత్తంమీద కాంతారావ్గా, నీవు అదృష్టవంతుడవోయి. దసరా వారం వుండగనే వచ్చాడు పిలుపులకు. నేను వెళదామన్నా పిలిచేవారు లేరుగదా—" నవ్వుతూ, వెంకట్రావ్ అనేసరికి, కాంతారావు నవ్వకుండా వుండలేకపోయాడు...

"బావా! నిన్ను వెంటనే పిల్చుకురమ్మన్నారు, మా నాన్న—అందుకే నన్ను పంపించారు..." కిష్టు ఆమాటలు అంటుంటే వెంకట్రావ్కు సంతోష మిచ్చింది...

కాంతారావు అంగీకరించలేదు వెళ్లటానికి. తను వెళ్ళటం, తన గౌరవానికి తగింది కాదని అతని అభిప్రాయం.

కాని వెంటనే వెంకట్రావ్ అన్నాడు: "బ్రదర్! నీ మనస్సులోవుంది నాకు తెలుసు. కాని వెళ్ళేది నీ మామగారింటికి. దానిమీద లక్ష్మికి ఎంత అధికారం వుందో, నీకు అంతే. పైగా మీ ఇరువురిలో ఎవ్వరూ గౌరవ హాని పొందరు...నా మాట విని వెళ్ళు..." వెంకట్రావ్ సలహావల నే కానీ, బలవంతంవల్ల నే కానీ కాంతారావు వెళ్ళక తప్ప లేదు. తప్పించుకోవటానికి ప్రయత్నించలేదు.

*       *       *

గుమ్మంలో అల్లుణ్ణి, కిష్టుని చూడగానే, కాంతారావు మామగారికి ఎక్కడలేని సంతోషం వచ్చింది...రండి రండని ఆహ్వానిస్తూ, లోపలికి తీసుకెళ్ళాడు.

కాసేపు సోఫాలో కూర్చున్నాక, బట్టలు మార్చుకున్నాడు కాంతారావు. అతనికి కొంచెం బిడియంగా వుంది, వాళ్ళేమన్నా అనుకుంటారేమో అని. తను చేసింది తప్పని తనకు లోలోపల తోస్తుంది. అతని పెంకితనం మాయమయింది.

అత్తగారు కాళ్ళకు నీళ్ళిచ్చింది. మరదలు కాంతారావు చుట్టూ తిరుగుతూ 'బావా! ఏం తెచ్చావు' అని ఆనందంతో అంది. తను తెచ్చిన యాపిల్ బుట్ట అందించాడు.

కాని అంతవరకు లక్ష్మి అవుపించలేదు. కాంతారావు తహతహ లాడుతున్నాడు. ఇంకా ఆమెకు కోపం పోలేదని మౌనంగా వున్నాడు.

ఆ రాత్రి పిండివంటలతో భోజనాలు జరిగాయి. కాంతారావు తను చేసిన పనికి మరీ మరీ నొచ్చుకున్నాడు...

భోజనా లయ్యాక అతను తనకు ఏర్పాటు చేసిన గదిలోకి వెళ్ళాడు. పక్కపొడి వేసుకొని, సిగరెట్ వెలిగించి, వేగంగా తిరుగుతున్న పంకావైపు చూస్తూ కూర్చున్నాడు.

అతని మనస్సు ఇప్పుడు నిర్మలంగావుంది. తుఫాను వీచిన తర్వాత, ఎంత ప్రశాంతంగా వుంటుందో అంతకంటే ఎన్నోరెట్లు ప్రశాంతత వ్యాపించి వుంది...అతనికి లక్ష్మిని గురించే ఆలోచనలు ఎక్కువయ్యాయి. వచ్చి మూడు గంటలైనా, యింకా కనుపించలేదు. ఆమెమీద యిప్పుడు కోపం లేదు. అసహ్యం అసలు లేదు. ప్రేమ పుట్టుకొస్తోంది. జాలి ఏర్పడుతోంది.

ఆక్షణంలోనే అతని ఆలోచనలకు భంగం కలిగింది. లక్ష్మి మహాలక్ష్మిలా అలంకరించుకొని గదిలోనికి వచ్చింది అతని కళ్ళు మిరుమిట్లు గొలిపాయి బెనారస్ సిల్కుచీర, వాపర్ లాంప్ కాంతితో పంచరంగులు ప్రదర్శించింది.

అతని నాలుక చివరవరకు మాటలు వచ్చాయి పలుకరించాలని. కాని ఏమిమాట్లాడాలో తెలియ లేదు.

"నే నేమాట్లాడుతా లేండి. మీ దేవిజయం" అంటూ లక్ష్మి కోకిలకంఠం విప్పింది.

"లక్ష్మి! ఆ చీర ఎక్కడిది?..." అతని ఆశ్చర్యానికి హద్దులు లేవు. లక్ష్మి నవ్వుతూ "మన పేచీ తెలిసి మా నాన్న తెచ్చారు. మీకు ట్వీడ్ సూట్ కూడా..." కాంతారావు ఏమీ మాట్లాడలేక పోయాడు.

ఉవ్వెత్తున లేచిన సముద్రపు అల తిరిగి యథాస్థాయికి వచ్చింది. చిన్న సంఘటన ద్వారా లేచిన తుఫాను ప్రశాంతతపొందింది.

★




నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది మేహము, బక్తాశ, విస్మృత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధికల్గించును 20 తు. వెల్పి రు 3-4-0 పోస్టేజిరు 1-1-0

ఏ న ఏ అండ్ కంపెనీ ఆయుర్వేద సమాజం, పెరిడేపి (PO) నెల్లూరుజిల్లా.

Ravi Inks



రవి ఇంక్స్

రోఖ బహువర్ణములతో అన్ని క్వాలిటీ పెన్నులకు ఉపయోగమైనవి.

సోల్ ఏజంట్లు:

న్యూస్టాక్ & కో;

మద్రాసు-21.

SWASTIK

పండిత డి గోపాలాచార్యులవారి

జీవామృతం

ఆరోగ్యానికి బలానికి

Diamond Jubilee

1898 1958

ఆయుర్వేదాశ్రమం(ప్రైవేట్)లిమిటెడ్, మదరాసు-17.